క్లుప్తంగా

చెట్ల కొమ్మల తొలగింపు



గుబురుగా పెరిగిన కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: బీసీ రోడ్డు నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు గుబురుగా పెరిగిపోవడంతో విద్యుత్ స్తంభాల నుంచి వెలుతురు రోడ్డుపై పడకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను డీవీఆర్ స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు డీవీఆర్ ఎలక్ట్రికల్ డీజీఎం వరప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులకు తెలియజేశారు. స్పందించిన అధికారులు గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగించారు. దీంతో విద్యుత్ దీపాల కాంతి రోడ్డుపైకి ప్రసరించడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నక్క దుర్గబాబు

పెదగంట్యాడ: గ్రామ అభ్యుదయ సేవా సంఘం సీతానగరం గ్రామ కమిటీ అధ్యక్షునిగా నక్క దుర్గబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 75వ వార్డు సీతానగరంలో శుక్రవారం ఈ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షునిగా నక్క సింహాచలం, కార్యదర్శిగా పల్లా హరిబాబు, కోశాధికారిగా పంచదార్ల అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా మురుకుతి అప్పలనాయుడు, నంబారు సన్యాసిరావు, కార్యనిర్వహణ అధ్యక్షునిగా ఓడిబోయిన అప్పలరాజు ఎన్నికయ్యారు. ఉప కోశాధికారిగా ఎర్రబెల్లి శంకర్, ఉప కార్యనిర్వహణ అధ్యక్షునిగా అనిపెద్ది గోపాలదాసు, సంయుక్త కార్యదర్శిగా నమ్మి చిన్నారావును, సభ్యులుగా పెద్దాడ వెంకటేష్, మొల్లి అప్పలరాజు, యలమంచిలి శివరామకృష్ణ, వాతాడ వీర్రాజు, సర్వశుద్ధి ముత్యాలు, నాట్ర శ్రీనును ఎన్నుకున్నారు.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్



పెయింటింగ్స్ వేస్తున్న మహిళలు

సీతమ్మధార: బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ ప్రారంభించారు. ఐదు రోజుల పాటు వర్క్‌షాప్ కొనసాగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాష్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. 14 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయసు గల బాలికలు, మహిళలు అర్హులని డైరెక్టర్ యామిని తెలిపారు. మొదటి రోజు స్థానిక మహిళలు పాల్గొని పలు పెయింటింగ్స్ వేశారు.

హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ మేళా

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ మేళా జరిగింది. విశాఖ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థ అయిన హెచ్‌సీఎల్‌లో టెక్ బీ ప్రవేశాలకు ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. జిల్లా నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులుగా గుర్తించారు. ఈ ఇంటర్వ్యూల్లో 11మంది అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ మేనేజర్ అనీల్, క్లస్టర్ మేనేజర్ సాయి కిరణ్, యుగేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విజ్ఞాన వీచిక

కాస్త ఫ్రీ టైం దొరికితే చాలు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారు పిల్లలు. చిన్నారుల ఆరోగ్యాన్ని, కాలాన్ని కూడా హరించే వాటికి దూరం చేయాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా కొత్త విషయాలను నేర్పించాలనే ఆసక్తి ఉన్నా, ఆర్థిక స్థోమత కారణంగా అటువైపు దృష్టి సారించలేకపోతున్నారు. ఆ లోటును భర్తీ చేస్తూ, వేసవి సెలవులను వినోదంతో పాటు విజ్ఞాన సముపార్జనకు వినియోగించేలా రాష్ట్రప్రభుత్వమే శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోంది. నియోజకవర్గంలోని రెండు గ్రంథాలయాల్లో ఈ శిబిరాలు విజయవంతంగా సాగుతున్నాయి.

- గ్రంథాలయాల్లో ప్రత్యేక శిబిరాలు
- చిన్నారులకు సృజనాత్మక కార్యక్రమాలు
- ప్రతిభను ప్రోత్సహిస్తూ బహుమతులు



తాము చదివిన కథపై చర్చిస్తున్న చిన్నారులు



పెదగంట్యాడ గ్రంథాలయంలో చిన్నారులు గీసిన చిత్రాలు

గాజువాక: గాజువాక, పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ విజ్ఞాన శిబిరాలు వచ్చేనెల 16వ తేదీ వరకు కొనసాగే విధంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించింది. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ఈ శిబిరాల్లో ఉత్సాహంగా ప్రదర్శించే విధంగా అవకాశం కల్పిస్తూ శిక్షణను నిర్వహిస్తున్నారు. కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దలు చెప్పే కథలపై చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలను రోజూ నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి రిసోర్స్ పర్సన్లు నిరంతరం కృషి చేస్తున్నారు. తమంతట తాముగా గ్రంథాలయాలకు వచ్చి కార్యక్రమంలో భాగస్వాములవుతున్న వారితో పాటు గ్రంథాలయ పాఠకుల్లో కొంత మంది తమ సహకారాన్ని అందిస్తున్నారు. దినపత్రికల్లో వచ్చే కథలను చదివే చిన్నారులను ప్రోత్సహించడం, గణితం ఎలా నేర్చుకోవాలి, డ్రాయింగ్ వేసే పద్ధతులపై సూచనలు, ఎలా చదవాలి, చదివిన దాన్ని ఎలా గుర్తుపెట్టుకోవాలి తదితర అంశాలపై శిక్షణనిస్తున్నారు.



డ్రాయింగ్‌లో ప్రతిభ ప్రదర్శించిన చిన్నారి



చీపురు పుల్లలతో డైనింగ్ టేబుల్ బొమ్మను తయారు చేసిన అఫీజా

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు శుక్రవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. చిన్నారులు చక్కని బొమ్మలు గీసి ఆకట్టుకున్నారు. అలాగే వారితో కథలు చదివించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా..

మా పాపను వేసవి శిబిరానికి పంపిస్తున్నాం. దీనివల్ల పాప సెల్‌ఫోన్, టీవీకి దూరంగా ఉంది. శిబిరంలో కూడా మంచి అంశాలపై చక్కగా బోధిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– రామలక్ష్మి, విద్యార్థిని తల్లి

సరదా సరదాగా..

పిల్లలకు బోధించడం చాలా సరదాగా ఉంటుంది. నాకు తెలిసిన కొన్ని మంచి విషయాలను వారికి బోధించాను. పత్రికల్లో వచ్చిన కథలను వారితో చదివిస్తూ వారి జ్ఞానం పెంచే విధంగా ప్రయత్నించాలనిపించింది.

–ఎ.వి.సురేష్ కుమార్, రిసోర్స్ పర్సన్

విశేష స్పందన

వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థుల నుంచి స్పందన పెరుగుతోంది. ఈ శిబిరాన్ని తొమ్మిది మంది విద్యార్థులతో ప్రారంభించాం. ఇప్పుడు విద్యార్థుల సంఖ్య 23కి పెరిగింది. వేసవి శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు కథలు చెప్పడం, డ్రాయింగ్ వేయడం, ఆటలు, పాటల్లో భాగస్వాములను చేయడంతో వారు సంతోషంగా గడుపుతున్నారు.

బి.చంద్రకళ, గాజువాక గ్రంథాలయాధికారి

పారిశుధ్య సిబ్బందికి నూనె, సబ్బుల పంపిణీ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డులోని 48 మంది పారిశుధ్య సిబ్బందికి కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేశారు. పెదమడకలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ వాటిని సిబ్బందికి అందించారు. వారు మాట్లాడుతూ ప్రతీ కార్మికునికి ఏడాదికి సరిపడా నాలుగు లీటర్ల కొబ్బరి నూనె, 12 సబ్బులు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, గాజువాక జోన్ శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి కొబ్బరినూనె, సబ్బులు అందిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి, ఏఎంహెచ్‌వో కిరణ్

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ గుడివాడ అప్పన్న కాలనీ, 11 కేవీ మింది ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా సంబంధిత ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ అప్పన్న కాలనీ, మింది ఏ బ్లాక్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో అగనంపూడి విద్యార్థుల ప్రతిభ

విజేతలకు కలెక్టర్ అభినందన

విశాఖ విద్య: జీవన నైపుణ్యాలు పెంపొందించేలా జిల్లాలోని అగనంపూడి జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు డి.నరేంద్ర, డి.జయంతి రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటికి విద్యార్థులే పరిష్కార మార్గాలు చూపేలా ప్రాజెక్టులను తయారు చేయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,700 ప్రాజెక్టులు రాగా, ఇందులో అగనంపూడి విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గైడ్ టీచర్ పి. కృష్ణవేణిని, ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను వీఎంఆర్‌డీఏలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో సైతం ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం నేడు

సీతంపేట: విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ కళారాధన పీఠం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఎల్.ఎన్.స్వామి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. రంగస్థల నటులు టీకే వీరభద్రాచారి, పసుమర్తి సన్యాసిరావు, సాహితీవేత్తలు సాలిపల్లి మంగామణి, వృద్ధుల కల్యాణ రామారావు, పాత్రికేయులు ఆర్.శివకుమార్, గాయని పల్లా మనోరమ, సేవారంగంలో రాయపల్లి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ అభిమాని బంటు అర్జునరావు, ప్రజా సేవా రంగంలో మోడేకుర్తి సత్యనారాయణ, కూచిపూడి నృత్య కళాకారిణి వాణి పద్మజలకు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతులమీదుగా పురస్కారాలు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర సర్దార్ గౌతు లచ్చన్న గీత కులాల యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ అభిమాన నాయకుల పుట్టిన రోజును పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అప్పలరాజు, గోవిందరావు, ఈశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి దంపతులు పేదలకు చీరలు పంపిణీ చేశారు. తమ పెళ్లిరోజును పురస్కరించుకుని శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్ డీజీఎం ఎంవీవీ సత్యనారాయణ, సీఆర్‌జీ ఏజీఎం నమ్మి తాతారావు, సీనియర్ మేనేజర్ గణేష్, కేపీ రాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రతిభ పోటీలు

డాబాగార్డెన్స్: మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కళా ఉత్సవ్ పేరిట ప్రతిభ పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా ఆ రెండు రోజులు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు ఉంటాయని చెప్పారు. శాస్త్రీయ నృత్యం, కూచిపూడి, జానపద నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంటల్, డ్రాయింగ్, పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ, గెటప్స్ పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీలో పాల్గొనదలచే వారు 9966485335, 9553333134 కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్: ఎన్‌టీ రామారావు శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని శనివారం ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు డి.భూపతిరాజు, ఎం.కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ చేతుల మీదుగా తన నివాసంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ స్వరాంజలి, స్వరార్చన సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా.. జయమ్ము నిశ్చయమ్మురా.. పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫణిభూషణ్, మెలోడి సత్యనారాయణ, ఎంవీఆర్, నాగేశ్వరరావు, జ్యోతి, సత్యవతి, కల్యాణి, ధరణి, నిహారిక, ఉమాప్రియా తదితర గాయనీ గాయకులు ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలు ఆలపించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సన్‌మూర్తి, విశాఖ సంగీత కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, స్వరమాధుర్యం అధ్యక్షుడు ఎంవీఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, నిర్వాహకులు

500 కిలోల రేషన్ బియ్యం సీజ్



బియ్యం పట్టుకున్న ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్

సింహాచలం: పెందుర్తి పశువుల ఆస్పత్రి వద్ద ఉన్న ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 50 0కిలోల రేషన్ బియ్యాన్ని శుక్రవారం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సీజ్ చేశారు. కొందరి సమాచారం మేరకు ఆర్డీవో, పెందుర్తి తహసీల్దారు ఆనంద్‌కుమార్, సివిల్ సప్లై ఆర్ఐ కలిసి పరిశీలన జరిపారు. భూలోక అనే నిర్వాసితుడు ఇంట్లో 500 కిలోలు అక్రమంగా రేషన్ బియ్యం దొరకడంతో అతనిపై కేసు నమోదు చేశారు.

సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

గాజువాక : రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యత నిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 73వ వార్డులోని గొంతినవానిపాలెం సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులను శుక్రవారం ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరికీ న్యాయం చేయడం కోసం ముఖ్యమంత్రి సంక్షేమానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన్ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రెడ్డి జగన్నాథం, నాయకులు కంది పైడినాయుడు, గొరుసు సత్యం, రామకృష్ణరాజు, అలీ, సంతోష్, కిరణ్, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పారిశుధ్య నిర్వహణపై అలక్ష్యం వహిస్తే చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- 73వ వార్డులో ఆకస్మిక పర్యటన

గాజువాక : డోర్ టు డోర్ చెత్త సేకరణ జరుగుతున్నప్పుడు రోడ్లపై చెత్త కుప్పలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ హెచ్చరించారు. 73వ వార్డులోని వుడా డబుల్ రోడ్‌లో ఆయన శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా శానిటేషన్ నిర్వహణపై ఆరా తీశారు. రోడ్లపై చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవన నిర్మాణదారులు రోడ్లను ఆక్రమించి ఇసుక, పిక్క వంటి మెటీరియల్ వేస్తున్నారని, వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతి దుకాణాల వద్ద తడి, పొడి చెత్తకు సంబంధించిన డబ్బాలను ఏర్పాటు చేయాలన్నారు. వ్యర్థాలను నేరుగా తమ వద్దకు వచ్చే జీవీఎంసీ చెత్త తరలింపు వాహనానికి అందించాలన్నారు. ఎవరి దుకాణం ముందు వారే శుభ్రం చేసుకోవాలని దుకాణదారులకు సూచించారు. పర్యటనలో ఇంజినీర్లు రవి, వినయ్ కుమార్, దిలీప్, ఏడుకొండలు తదితరులున్నారు.



డబుల్ రోడ్‌లో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

స్వచ్ఛతతో ఆరోగ్యం

అక్కిరెడ్డిపాలెం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఏడీసీ సన్యాసిరావు అన్నారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో రామాలయం వద్ద శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీసీ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను విభజించి, ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని సూచించారు. శానిటరీ గొట్టాలకు అమర్చే నెట్‌లను స్థానికులకు అందజేశారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో గాజువాక జెడ్సీ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్, మలేరియా సూపర్‌వైజర్ కె.అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



శానిటరీ గొట్టాలకు అమర్చే నెట్‌లను మహిళలకు అందిస్తున్న ఏడీసీ సన్యాసిరావు

సచివాలయ సిబ్బంది ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు చినఅక్కిరెడ్డిపాలెంలో సచివాలయ పరిధిలో హెల్త్ సెక్రటరీ కె.అబద్ధం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న గాజువాక పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎస్.రాజు దోమల వల్ల వచ్చే విషజ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ మురళీ కృష్ణ, ఆశ కార్యకర్త, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు అభినందనలు



డైరెక్టర్ పాండేను అభినందిస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్ చంద్ర పాండేను ప్లాంట్‌కు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందించారు. శాలువాలు కప్పి, పూలమాలలతో ముంచెత్తారు. కార్మిక సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై డైరెక్టర్ మాట్లాడుతూ యూనియన్లు, యాజమాన్యం కలిసి పని చేస్తే కంపెనీని లాభాల బాటలోకి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, నాయక్, సుబ్బయ్య, ప్రభాకరరెడ్డి, కొమ్ము ప్రసాద్, ఎస్. రమేష్‌కుమార్, జెర్రిపోతుల మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఎంఎస్‌పై హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

స్టీల్‌ప్లాంట్ పదవీ విరమణ ఉద్యోగుల పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ (పీఆర్ఎంఎస్)పై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని ఉక్కు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్ చంద్ర పాండేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, దాడి శివరామ్, భీశెట్టి సన్యాసిరావు, దశరథ్, వాసామూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం కానివ్వం'

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 820వ రోజు శుక్రవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైనా ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

'ఐయామ్ ఏ నర్స్' పాట విడుదల

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎంఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అన్నీ ప్రేమజ ఆదిశర్ల రూపొందించిన 'ఐయామ్ ఏ నర్స్' పాట విడుదలైంది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె ఈ పాటను విడుదల చేశారు. కేజీహెచ్‌లో 38 ఏళ్ల పాటు నర్సింగ్ వృత్తిలో కొనసాగి రెండేళ్ల కిందట నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేసిన తన తల్లి ఎవాంజెలిన్ ఎస్తేర్‌కు ఈ పాటను అంకితం ఇస్తున్నట్లు ప్రేమజ తెలిపారు. ప్రతీ ఒక్కరి జీవితంలో నర్సుల పాత్రను తెలియజేస్తూ రూపొందించిన ఈ పాట అందర్నీ ఆకట్టుకుంటుందన్నారు. ఈ పాటకు సాహిత్యం తానే అందించానని, సూరజ్ గిప్సన్ సంగీతం, మనోహర్, పీటర్ వీడియో ఎడిటర్లుగా సహకారం అందించారని చెప్పారు.